

ఉపాధి పనుల్లో.. నీడ లేదు నీరు లేదు



భాజీపేట మండలంలో ఉపాధి పనులు

వలసల నివారణ, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం అమలు చేస్తోంది. దీని ద్వారా ప్రతికుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం. గతంలో కూలీలకు వేసవిలో అదనపు అలవెన్స్‌లు, తాగేందుకు మజ్జిగ, ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు టెంట్లు వేసేవారు. ఇప్పుడు అవన్నీ లేవు. దీంతో కూలీలు ఎండకు ఎండుతూ, ఉక్కబోతతో పనులు చేస్తున్నారు. ఇక పనిచేసిన కూలీలకు డబ్బులు కూడా దాదాపు ఏడు వారాల నుంచి పడలేదు. రూ.17 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. వ్యవసాయ పనులు లేనప్పుడు ఉపాధి హామీ పథకం ఆదుకుంటున్నప్పటికీ.. పనులు చేసినా డబ్బులు రాకపోవడంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలుపై శనివారం ఆంధ్రజ్యోతి విజిట్‌లో కూలీల కష్టాలు వెలుగుచూశాయి.

- వేసవి అలవెన్స్ ఊసే లేదు
- తాగేందుకు మజ్జిగ లేదు
- రూ.17 కోట్ల కూలీ బకాయిలు
- ఆంధ్రజ్యోతి విజిట్‌లో వెలుగుచూసిన వాస్తవాలు

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల మొదటి వారం నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. ఒక పక్క భానుడు భగభగలు.. మరో పక్క ఉక్కబోతతో జనం అల్లాడుతున్నారు. ఉదయం 10గంటలకే సూర్యుడు నిప్పులు గక్కుతున్నాడు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీల పరిస్థితి దౌర్భాగ్యంగా మారింది. 2014-19 టీడీపీ హయాంలో కూలీలకు పని చేసే చోట అన్నిమౌలిక వసతులు కల్పించేవారు. వేసవిలో నేల గట్టిగా ఉండడం వల్ల పనులు సరిగా చేయలేరు. దీంతో ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో అప్పట్లో ప్రభుత్వం ఏప్రిల్, మే నెలలో కూలిపై 30 శాతం అలవెన్స్ ఇచ్చేది. అంటే వంద రూపాయల పనిచేస్తే అదనంగా రూ.30 వచ్చేది. అలాగే ఎండ నుంచి నీడ కోసం టెంట్ వేసేవారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు మజ్జిగ సరఫరా చేసేవారు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందుబాటులో ఉండేవి. అయితే 2021 నవంబరు 15 నుంచి ఉపాధి హామీ పనులకు సంబంధించి ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లోకి మారడంతో అదనపు అలవెన్స్, మజ్జిగ ఇతరాలకు కోత పడింది. అప్పటి నుంచీ ప్రతి ఏటా మండుటెండలో కూలీలు అవస్థలు పడుతున్నారు.

మండే ఎండలోనే పనులు

- భాజీపేట మండలంలోని చెర్లోపల్లె, మూలవారిపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను ఆంధ్రజ్యోతి పరిశీలించింది. అక్కడ కూలీలు పనిచేసినప్పుడు అలసటకు గురైతే విశ్రాంతి తీసుకునేందుకు ఎలాంటి టెంటు ఏర్పాటు చేయలేదు. అక్కడ నీళ్లు కూడా లేవు. ప్లాస్టిక్ డబ్బాల్లో ఇంటి నుంచి తీసుకువచ్చిన నీళ్లు సలసలా మండతుండడంతో తాగలేక ఇబ్బందులు పడుతున్నారు.
- రాజుపాలెంలో ఎండలోనే ఉపాధి పనులు చేస్తున్నారు. ఫిబ్రవరి 6వరకు చేసిన పనులకు మాత్రమే డబ్బులు పడినట్లు కూలీలు తెలిపారు.
- లింగాలలో జరిగిన పనులు పరిశీలించగా అక్కడ వసతులు లేవు. ప్రథమ చికిత్స చేసే కిట్‌లు కూడా లేవు.
- మజ్జిగ కథ దేవుడెరుగు.. ఉపాధి కూలీలకు ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు నీడలేదు. తాగేందుకు నీరు లేదు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు అసలే లేదు. ఈ దుస్థితి దువ్వూరు సమీపంలో గుట్టల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్ద కనిపించింది.
- జమ్మలమడుగు మండలంలో ఎక్కడ పనులు జరుగుతున్నాయో కూడా అధికారులకు తెలియని పరిస్థితి. ఉపాధి హామీ పనుల గురించి ఎక్కడ జరుగుతున్నాయో ఎంపీడీవో సయ్యదున్నీసాను అడగ్గా ఏపీవోను అడిగి తెలుసుకుంటానని సమాధానమిచ్చారు. శనివారం పనులు చేయలేదని చెప్పుకొచ్చారు. జిల్లాలో అన్ని చోట్లా ఇదే పరిస్థితి నెలకొంది. కూలీలు చాలా అవస్థలు పడుతున్నారు.

రూ.17 కోట్ల బిల్లులు పెండింగు

జిల్లాలో ఫిబ్రవరి 7 నుంచి కూలీలకు డబ్బు రాలేదు. సుమారు 40వేల మంది కూలీలకు రూ.17 కోట్లు కూలి డబ్బులు రావాలి. రెండు, మూడురోజుల్లో రూ.ఐదు కోట్ల మేర డబ్బులు అకౌంటులో పడతాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సరాసరి కూలి రూ.260 వస్తోంది.

శనివారం ఉపాధి పనులకు 500 మందికి పైగా కూలీలు హాజరైన మండలాలు ఇవే..

పోరుమామిళ్ల	1,660
వీఎన్‌పల్లె	1,505
ఖాజీపేట	1,245
దువ్వూరు	1,026
బి.మఠం	801
చక్రాయపేట	800
చెన్నూరు	560
సీకేదిన్నె	539
గోపవరం	566
కలసపాడు	935
కమలాపురం	783
లింగాల	760
ముద్దనూరు	880
మైలవరం	525
పెద్దముడియం	748
పెండ్లిమర్రి	860
ప్రొద్దుటూరు	670



రాజుపాలెంలో ఉపాధి హామీ పనులు

జిల్లాలో 'ఉపాధి' వివరాలు

మొత్తం జాబ్‌కార్డులు	2,26,228
ఇందులో ఉన్న కూలీల సంఖ్య	4,12,457
యాక్టివ్ జాబ్‌కార్డుల సంఖ్య	1,93,274
ఇందులో ఉన్న కూలీల సంఖ్య	3,27,565
మార్చి 29 వరకు పనులకు వచ్చిన కుటుంబాలు	1,49,506
పనులకు వచ్చిన కూలీల సంఖ్య	2,38,251
2024-25 ఆర్థిక సంవత్సరంలో పనిదినాల లక్ష్యం	77లక్షలు
మార్చి 29 నాటికి కల్పించిన పనిదినాల సంఖ్య	75,40,843
వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్య	11,854
సరాసరి ఒకరి కూలీ	రూ.260.46
శనివారం హాజరైన కూలీల సంఖ్య	23,750
ఇంత వరకు కూలీల వేతనాలకు ఖర్చు చేసిన డబ్బు	రూ.196.42 కోట్లు
మెటీరియల్ కోసం చేసిన ఖర్చు	రూ.166.28 కోట్లు

శాశ్వత లోక్‌అదాలత్‌తో ప్రజాప్రయోజన సేవలు



మాట్లాడుతున్న శాశ్వత లోక్‌అదాలత్ పబ్లిక్ యుటిలిటీ సేవల చైర్మన్ స్వర్ణప్రసాద్

కడప రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రయోజన సేవలే లక్ష్యంగా శాశ్వత లోక్అదాలత్ పని చేస్తోందని శాశ్వత లోక్అదాలత్ పబ్లిక్ యుటిలిటీ సేవల చైర్మన్ స్వర్ణప్రసాద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో శాశ్వత లోక్‌అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలపై ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాశ్వత లోక్‌అదాలత్ ద్వారా పలు రకాల సేవలను అందిస్తున్నామన్నారు. ప్రజాప్రయోజన సేవల రంగాలకు సంబంధించిన వివాదాలన్నింటినీ ఎటువంటి ఫీజు లేకుండా సత్వరం శాశ్వత లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. గడువులోపు ప్రతి దరఖాస్తును పరిష్కరిస్తామన్నారు. రవాణా సేవలతో పాటు విద్యుత్, నీటిసరఫరా, బ్యాంకు లోనుల సమస్యలు, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల క్రెడిట్ కార్డుల సమస్యలు, మునిసిపాలిటీ సేవలు, పన్నుల తగాదాలు, ఇన్సూరెన్స్ కంపెనీలకు సంబంధించిన వివాదాలు, సెల్‌ఫోన్, టెలిఫోన్ కంపెనీల వివాదాలు, ఆసుపత్రుల సేవలు తదితర సమస్యలపై ప్రజాప్రయోజన శాశ్వత లోక్‌అదాలత్‌ను ఆశ్రయించి ఎటువంటి ఖర్చు లేకుండా పరిష్కారం చేసుకోవచ్చన్నారు. పార్టీల మధ్య వివాదానికి ఇక్కడ సామరస్యపూర్వకంగా పరిష్కారం దొరుకుతుందన్నారు. పార్టీలు సెటిల్‌మెంట్‌కు రాకుంటే మెరిట్ ఆధారంగా అవార్డులను ఆమోదించడానికి శాశ్వత లోక్‌అదాలత్‌కు అధికారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్లు, శాశ్వత లోక్‌అదాలత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు

కడప కలెక్టరేట్/క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది, అలాగే రంజాన్ పండుగల సందర్భంగా జిల్లా ప్రజలకు శనివారం వేర్వేరు ప్రకటనల్లో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు భక్తి శ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని, ప్రతి ఇంట్లో సుఖ సంతోషాలు, ఆరోగ్య సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు.

ఐదుగురికి కళారత్న అవార్డులు

కడప కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన జిల్లాకు చెందిన ఐదుగురికి ఉగాది సందర్భంగా కళారత్న (హంస) అవార్డులు వరించాయి. శనివారం రాష్ట్రవ్యాప్తంగా వివిధ రగాల్లో సేవలందిస్తున్న 116 మందికి రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది. అందులో నాటకరంగంలో ఓంశాంతినగర్ నివాసి సింగంశెట్టి అరుణకుమారి, సాహిత్యంలో కడపకు చెందిన చింతకుంట శివారెడ్డి, మొగిలిచెండు సురేశ్, బద్వేల్‌కు చెందిన గానుగపెంట హనుమంతరావు, ప్రొద్దుటూరు వాసి జింకా సుబ్రమణ్యం ఉన్నారు. ఆదివారం వీరంతా విజయవాడలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పురస్కారాలు అందుకోనున్నారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈ ఆది, సోమవారాలు సెలవు దినాలైనప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు

పోలీసు ప్రతిష్ఠ పెంచండి

- ఆదేశించిన ఎస్పీ అశోక్‌కుమార్



కడప క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖ ప్రతిష్ఠ మరింత పెంపొందించేలా విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాను గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల రహితంగా చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై దృష్టి పెట్టాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పల్లెనిద్ర నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరిచిన డీఎస్పీలు వెంకటేశ్వర్‌రావు (జమ్మలమడుగు), భావన (ప్రొద్దుటూరు), సీఐలు భాస్కర్‌రెడ్డి (సీసీఎస్), ఓబులేసు (చిన్నచౌకు), రామక్రిష్ణ (కడప వన్‌టౌన్), మధుమల్లేశ్వరరెడ్డి (సైబర్ క్రైం), నాగభూషణం (బద్వేలు రూరల్), శివశంకర్ (మైదుకూరు రూరల్), బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్‌తో పాటు 18 మంది పీసీలకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

టీడీపీ సంబరం



టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆర్.మాధవి, బి.హరిప్రసాద్ తదితరులు

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి





సరోజ, రామమోహన్ మృతదేహాలు

కొండాపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కొండాపురంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ముచ్చుమర్రికి చెందిన దంపతులు తూర్పింటి రామమోహన్(45), సరోజ(40) కొండాపురంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటూ పాలవ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. దంపతులు ఇద్దరూ శనివారం తెల్లవారుజామున 6 గంటల ప్రాంతంలో బైక్‌లో పాల వ్యాపారానికి బయలుదేరారు. స్థానిక సీఎంఆర్ కాంప్లెక్స్ వద్ద రోడ్డును క్రాస్ చేస్తుండగా ముద్దనూరు వైపు వెళుతున్న కారు వీరి బైకును ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ వీరిని 108 వాహనంలో తాడిపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే సరోజ మృతిచెందింది. తీవ్ర గాయాలైన రామమోహన్‌ను అనంతపురం ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ సాయంత్రం మృతిచెందాడు. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా ఒక కుమార్తె ఇంజనీరింగ్ చదువుతోంది. కుమారుడు జస్వంత్ పదవతరగతి పరీక్షలు రాస్తున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కొండాపురం ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

కుర్చీకోసం కుట్ర దుర్మార్గం

- కబ్జాలు, పార్టీలు మారడం శ్రీనివాసరెడ్డి నైజం
- మేయర్ సురేశ్‌బాబు



విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ సురేశ్‌బాబు

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కుర్చీ కోసం తనపై ఎమ్మెల్యే మాధవి కుట్రపూరిత ఆరోపణలు చేయడం దుర్మార్గమని మేయర్ సురేశ్‌బాబు అన్నారు. తనకు ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసుపై తగిన విధంగా వివరణ ఇస్తామని స్పష్టం చేశారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రూ.30 లక్షల విలువ గల పనులు తమ కుటుంబ సభ్యులు చేస్తే దానిని తప్పుబడుతున్నారన్నారు. తమ కుటుంబ సభ్యులు కాంట్రాక్టు చేసిన విషయం తనకు తెలియదన్నారు. వారికి పనులు అప్పగించిన విషయం అధికారులు చూసుకోవాలని అన్నారు. ఈ విషయాన్ని అధికారులు తన దృష్టికి తీసుకు రాలేదన్నారు. కార్పొరేషన్ సమావేశ మందిరంలో మేయరు కుర్చీ పక్కన ఎమ్మెల్యేకు కుర్చీవేయలేదన్న అక్కసుతో రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని విమర్శించారు. అవినీతికి ఆజ్యం పోసే టీడీపీ నేతలు తనపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. 2015, 2016, 2017 సంవత్సరాలలో నీరు - చెట్టుకింద అర్బన్ ఏరియాలో రూ.70లక్షల పనులు చేసింది టీడీపీ కాదా అని ప్రశ్నించారు. అర్బన్ ప్రాంతంలో నీరు-చెట్టు కింద పనులు చేయడం అక్రమమని తెలిపారు. పది సంవత్సరాల్లో కార్పొరేషన్ అభివృద్ధికి దాదాపు రూ.2200 కోట్లు ఖర్చు చేశామన్నారు. వాటిలో ఏ ఒక్క వర్క్‌కు సంబంధించి అయినా తాను కానీ, తన కుటుంబ సభ్యులతో కానీ పనులు చేయించలేదన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కడప పైలాన్ సర్కిల్‌లో ఆర్ఎస్ఆర్ కాంప్లెక్స్ కోసం నాలుగు సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకున్నారని, దీనిపై ఆయనకు నోటీసు ఇస్తే కోర్టుకు పోయి స్టే తెచ్చుకున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతోందని, కడప ఎమ్మెల్యే మాధవి అసెంబ్లీలో గంజాయి గురించి తప్ప కడప అభివృద్ధి కోసం ఒక్క పైసా నిధులు ఏమైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారిన చరిత్ర ఆ కుటుంబానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అవినీతిని అంతం చేయడమే లక్ష్యం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అవినీతిని అంతమొందించడమే తమ ప్రధాన లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. మేయర్ సురేశ్‌బాబు అవినీతికి పాల్పడ్డాడు కాబట్టే ప్రభుత్వం షోకాజ్ నోటీసు జారీ చేసిందన్నారు. శనివారం ద్వారకానగర్‌లోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 1959 నుంచి తన తండ్రి రాజగోపాల్‌రెడ్డి కాంట్రాక్టు పనులు చేశారన్నారు. తాను కూడా 1991 నుంచి కాంట్రాక్టరుగా ఉత్తర, దక్షిణ భారతదేశంలో పనులు చేస్తున్నానని స్పష్టం చేశారు. కార్పొరేషన్‌లో మైనార్టీ మహిళ ఉంది కదా, ఆమెకోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ముందుగా షోకాజ్ నోటీసులకు మేయర్ సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటరు సుబ్బారెడ్డి, టీడీపీ నేత జిలానీబాషా పాల్గొన్నారు.

రూ.100కోట్లతో ఆలయాల నిర్మాణం

- ఎండోమెంట్ ఈఈ గంగయ్య



పోట్లదుర్తిలో నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని పరిశీలిస్తున్న సీఎం సురేశ్‌నాయుడు, ఎండోమెంట్ ఈఈ గంగయ్య

ఎర్రగుంట్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.100కోట్లతో ఆలయాల నిర్మాణం చేపట్టామని ఎండోమెంట్ ఈఈ గంగయ్య తెలిపారు. పోట్లదుర్తిలో రూ.కోటితో నిర్మిస్తున్న లలితాదేవి ఆలయాన్ని ఆయన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేశ్‌నాయుడుతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆలయాలు నిర్మించేందుకు ఇతోధికంగా సహకారం అందిస్తోందన్నారు. వివిధ జిల్లాల్లో సుమారు రూ.వందకోట్లతో ఆలయాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం సురేశ్‌నాయుడు మాట్లాడుతూ లలితాదేవి ఆలయం నిర్మించేందుకు రూ.20లక్షలు గ్రామం తరుపున చెల్లించామని, రూ.80లక్షలు ప్రభుత్వం ఇస్తోందన్నారు. అనవరమైతే మరో రూ.30లక్షల వరకు తాము ఖర్చు చేసేందుకు వెనుకాడమన్నారు. దసరాకు పూర్తి చేసి అత్యంత వైభవంగా ప్రారంభోత్సవం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పి.శివప్రతాప్‌రెడ్డి, సర్పంచి నరసింహులు, కె.క్రిష్ణారెడ్డి, రామక్రిష్ణనాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పండగల సందడి

- కిటకిటలాడిన మార్కెట్లు.. వస్త్ర దుకాణాలు
- పూలంగళ్ల వద్ద జనం రద్దీ ● ఎటు చూసినా ట్రాఫిక్ జాం



పూలు, మామిడి ఆకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పీలేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో శనివారం సాయంత్రం పండుగల సందడి నెలకొంది. అటు తెలుగు సంవత్సరాది ఉగాది, ఇటు పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందడికి కారణమైంది. పండుగల కోసం నిత్యావసర సరుకులు, పూజాసామాగ్రి, కొత్త బట్టలు కొనుగోలు చేసేందుకు శనివారం సాయంత్రం ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో పట్టణంలోని ప్రధాన రహదారి అయిన ఎల్‌బీఎస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం కిటకిటలాడింది. పూల అంగళ్లు, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి. పూజా సామాగ్రి అంగళ్ల వద్ద రద్దీ నెలకొంది. ఉగాది సందర్భంగా తమ పూర్వీకులకు బట్టలు పెట్టుకునే సంప్రదాయం ఉండడంతో బయటి ప్రాంతాల్లో ఉన్న చాలామంది తమ సొంతూర్లకు పయనం కావడంతో ఆర్టీసీ బస్టాండు ప్రయాణీకులతో కిటకిటలాడింది. అంతేకాకుండా రంజాన్ పండుగ కోసం ముస్లింలు సైతం పెద్దఎత్తున కొనుగోళ్ల కోసం బయటకు రావడంతో దుకాణాలన్నీ కిటకిటలాడాయి.





పీలేరులో పండ్లు, దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



మదనపల్లెలోని బెంగళూరు బస్టాండ్ పూలమార్కెట్‌లో రద్దీగా జనం

మదనపల్లెలో...

ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా మదనపల్లె పట్టణంలో జనం కిక్కిరిసిపోయారు. శనివారం సాయంత్రం స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో పూల అంగళ్ల వద్ద జనం రద్దీగా కనిపించారు మదనపల్లె పట్టణం, రూరల్ ప్రాంతాల నుంచి జనం ఎక్కువగా పట్టణంలోకి పండగ సామాగ్రి కొనుగోలు చేయడానికి రావడంతో మార్కెట్లు, రోడ్లు రద్దీగా మారిపోయాయి. వాహనాలు ఎక్కువగా రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ జామ్ అయి వాహనాలు రోడ్డుపై బారులు తీరాయి. మల్లికార్జున సర్కిల్ నుంచి టౌన్ బ్యాంకు సర్కిల్ వరకు ట్రాఫిక్ జామ్ అయింది.

జిల్లాలో తాగునీటి సమస్య ఉండకూడదు

- 1వ తేదీ పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య ఉండకూడదని, ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, 1వ తేదీ పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్‌శాఖ సిబ్బంది, ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ సిబ్బంది, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య కనిపించకూడదని, దానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డయేరియాకు గురికాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎన్జీవోలు, దాతలతో సమన్వయం చేసుకొని ప్రజలందరికీ చలివేంద్రాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. 1వ తేదీ ఉదయం 7 గంటల నుంచి పింఛన్ల పంపిణీ జరగాలని ఆదేశించారు. పల్లె పండుగ పనులపై సమీక్షిస్తూ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్‌శాఖ సిబ్బందిని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ ద్వారా వచ్చే అర్జీలను నాణ్యతతో, అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని సూచించారు. గ్రామీణ ఉపాధి హామీలో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొన్ని మండలాల్లో ఎన్టీఆర్ హౌసింగ్‌లో స్టేజీ కన్వర్షన్ అవ్వాల్సిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ ఆధారితమైన మన జిల్లాలో 100 రూపాయల్లో 21 రూపాయల ఆదాయం ఉద్యానవనశాఖ నుంచి మరో 21 రూపాయల ఆదాయం పశుపోషణ ద్వారా వస్తుందని కేవలం ఐదు శాతం మాత్రమే వ్యవసాయం మీద ఆదాయం వస్తోందని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనను వినియోగించుకోవాలి

ఏప్రిల్, మే, జూన్ నెలల గ్రామీణ ఉపాధి కల్పన ప్రణాళికలోని పంచ ప్రాధాన్యాలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా ప్రజలకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డ్వామా పీడీ వెంకటరత్నంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏప్రిల్, మే, జూన్ నెలల ఉపాధి కల్పన ప్రణాళికలోని పంచ ప్రాధాన్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల అభివృద్ధిలో భాగంగా అతి ముఖ్యమైన ఐదు అంశాలైన పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టడం, సేద్యపు నీటి కుంటల నిర్మాణం, పంట కాలువల్లో పూడిక తీయడం, సాగునీటిల చెరువుల్లో పూడికతీత, సగటు వేతనం రోజుకు కనీసం రూ.300 ఉండేలా చూడడం అనే ఐదు అంశాలు లక్ష్యంగా ఏప్రిల్, మే, జూన్ నెలల ఉపాధి కల్పన ప్రణాళికను రూపొందించామన్నారు. జిల్లా ప్రజలందరూ ఈ పంచ ప్రాధాన్యాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు.

కారు దహనం కేసులో నిందితుడు అరెస్టు

రామసముద్రం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలో సంచలనం కలిగించి ఉద్రిక్తతకు దారి తీసింది మండల టీడీపీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడుకు చెందిన ఇన్నోవా కారు దహనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. రామసముద్రం పంచాయతీ గుంతల పేట గ్రామానికి చెందిన నూలు శ్రీనివాసులు కారు దహనానికి పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫైళ్ల దహనం కేసులో సీఐడీ విచారణ



రెవెన్యూ కార్యాలయంలో విచారణ చేస్తున్న సీఐడీ అధికారులు

వాల్మీకిపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసుకు సంబంధించి శనివారం వాల్మీకిపురం కార్యాలయంలో సీఐడీ విచారణ చేపట్టింది. రైతులతో కలిసి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం విషయమై మండలంలోని 26 మంది రైతులకు చెందిన ఫైళ్లు దహనం కావడం, తదితర విషయాలపై సీఐడీ అధికారులు ఆరా తీశారు. రైతులు స్వయంగా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారా అక్కడ ఎవరితోనైనా మాట్లాడారా తదితర విషయాలను నేరుగా రైతులతో చర్చించారు. అలాగే పలు వివరాలను రైతుల నుంచి రికార్డు చేశారు. కార్యక్రమంలో సీఐడీ ఎస్‌ఐ మంజుల, వీఆర్వో స్వర్ణలత, రెవెన్యూ అధికారులు, రైతులు ఉన్నారు.

నాటుసారా, మద్యం విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు

మదనపల్లె టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) మండలంలో నాటుసారా, కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో సీటీఎం దళితవాడలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మస్తాన్ భార్య ఎర్రబల్లి బుజ్జి (42), వెంకటరమణ కుమారుడు పి.లక్ష్మీనారాయణ వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే చీకిలబైలు గ్రామంలో జె.శ్రీనివాసులు భార్య జె.నాగమ్మ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా ఆమె వద్ద 31 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అలాగే మొదటి ఇద్దరు నిందితులకు నాటుసారా సరఫరా చేసిన మేకలవాండ్లపల్లెకు చెందిన మల్లికార్జునపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు డోర్కాస్, జబీవుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణ కుటుంబానికి ఆర్థికసాయం



రామకృష్ణ కుటుంబానికి నగదు అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐ లోకేశ్

మదనపల్లె టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం కృష్ణాపురంలో వైసీపీ నాయకుడి చేతిలో హత్యకు గురైన టీడీపీ కార్యకర్త రామకృష్ణ కుటుంబానికి మదనపల్లెకు చెందిన ఎన్‌ఆర్‌ఐ లోకేశ్ కొణెదల ఆర్థికసాయం చేశారు. శనివారం రాత్రి కృష్ణాపురానికి వెళ్లిన ఎన్‌ఆర్‌ఐ లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి నిలిచిన ప్రతి ఒక్కరికి పార్టీ అధిష్ఠానం అండగా ఉంటుందన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తన వంతు రామకృష్ణ కుటుంబానికి రూ.1.50 లక్షల ఆర్థికసాయం అందించానన్నారు. కార్యక్రమంలో పెరవలి నవీన్, రాజేష్, నిరంజన్‌నాని, మార్పురి రమేశ్, వంశీనరసింహ, గగన్‌సాయి, మహేష్, రామకృష్ణ కుమారులు పాల్గొన్నారు.

పండుగలను సంతోషంగా జరుపుకోవాలి

రాజంపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగలను అందరూ సంతోషంగా జరుపుకోవాలని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని, దేవాలయాల వద్ద, మసీదుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగరాదన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో శనివారం ఉదయం స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. వేకువజామునే ఆలయ అధికారులు పట్టు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలను అర్చకులకు అందజేశారు. ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అర్చకులు మనోజ్‌కుమార్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన హెడ్‌కానిస్టేబుల్ మృతి

ఆదినారాయణ కుటుంబానికి అండగా ఉంటాం : ఎస్పీ



హెడ్‌కానిస్టేబుల్ సతీమణికి నగదు అందజేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆదినారాయణ ఈనెల మొదటి వారంలో పీలేరులోని ఇంటికి వెళుతూ ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ మృతి పట్ల ఎస్పీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన మృతి పట్ల వాల్మీకిపురం ఎస్‌ఐ చంద్రశేఖర్, సహోద్యోగులు చిత్తూరు జిల్లాలోని పులిచెర్ల మండలం మంగళంపేట బలిజపల్లెలోని హెడ్ కానిస్టేబుల్ స్వగృహంలో ఉన్న ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎస్పీ ఆదేశాల మేరకు దహన సంస్కారాలకు లక్ష నగదును ఆయన సతీమణికి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు



గాయపడిన ఇరగంరెడ్డి

రామాపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం నీలకంఠ్రావుపేట గ్రామం శివాలయం వద్ద శనివారం బైక్ అదుపు తప్పి ఆవుల ఇరగంరెడ్డి మరో బాలికకు తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు... గాలివీడు మండలం నూలివీడుకు చెందిన ఆవుల ఎర్రగంరెడ్డి మరో బాలిక కడపలో చదువుతున్నారు. సెలవుల కారణంగా వారిరువురు బైక్‌పై ఇంటికి వస్తుండగా శివాలయం వద్దకు రాగానే ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆగింది. వేగంగా వస్తున్న బైక్‌ను అదుపు చేయలేక బస్సును వెనుక వైపు నుంచి ఢీకొనడంతో ఇరువురు గాయపడ్డారు. సంఘటనా స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీరభద్రాలయంలో అమావాస్య పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవంలో వీరభద్రుడు

రాయచోటిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు భద్రకాళీ అమ్మవారు వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి పల్లకీ ఉత్సవంపై ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగించారు.

చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభం





ప్రత్యేక వెండి అలంకరణలో చౌడేశ్వరీదేవి, ఊరేగింపుగా దివ్వెలను తీసుకెళుతున్న మహిళలు

మదనపల్లె అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరిదేవి ఆలయంలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే ఉగాది, చౌడేశ్వరీ దేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే గణపతి, చౌడేశ్వరిదేవి, సుబ్రహ్మణ్యం స్వాములకు ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మదనపల్లె పట్టణంలోని, నీరుగట్టువారిపల్లె పురవీధుల నుంచి మున్నెప్పకాలనీ, కనకదాస్ నగర్, అయోధ్యనగర్, కాట్లాటపల్లె రోడ్డు, రామిరెడ్డి లేవుట్, చంద్రాకాలనీ, అనపగుట్ట నుంచి కూడా మహిళలు భక్తి శ్రద్ధలతో దీలు బోనాలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు.

అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని చౌడేశ్వరీదేవిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, సెక్రటరీ బండి పవన్ కుమార్, ట్రెజరర్ రత్నమయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. పూజా కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బండి నాగరాజ, రామిశెట్టి నీలకంఠ, రామిశెట్టి ఆంజనేయులు, శీలం రమేష్ బాబు, వెంకటేశ్, సిద్దప్ప, పాల్గొన్నారు.

చోరీ యత్నం విఫలం ... ఒకరిపై దాడి

నందలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నీలిపల్లె గ్రామంలో శనివారం వేకువజామున సనవర్ అనే వ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి ప్రయత్నించారు. ఏఎస్‌ఐ ఐ.మోసెస్ వివరాల మేరకు... బడేరాత్ సందర్భంగా పాటూరుకు వెళ్లిన ఆ ఇంటిలోని యువకులు షేక్ సల్మాన్, షేక్ షబ్బీర్‌బాషాలు ఇంటివద్దకు వచ్చి చూడగా గేటు తెరచి ఉండడం గమనించారు. అలికిడి విన్న దొంగలు పారిపోయే ప్రయత్నంలో షేక్ సల్మాన్‌పై ఇనుపరాడ్‌తో దాడి చేశారు. దొంగలు వేసుకొచ్చిన బైకుతో పాటు దాడి చేసిన రాడ్, చెప్పులను అక్కడే వదిలి వెళ్లారు. ఈ సంఘటనపై యువకులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్ సంఘటన స్థలానికి చేరుకుని బైకు, ఇనుపరాడ్, చెప్పులను స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

పేకాట నిర్వహణ ఆరోపణలతో కానిస్టేబుల్ సస్పెన్షన్

రాయచోటిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట జోరుగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలతో కానిస్టేబుల్ రామాంజులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామాంజులు కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా రాయచోటి మండల పరిధిలో పలు ప్రాంతాల్లో పేకాట నిర్వహణ విషయంలో బయట ప్రాంత వ్యక్తులకు ఆశ్రయం కల్పించి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో మామూళ్లు పుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వచ్చాయి. స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసిన సమయంలో పట్టుబడిన వారిలో కానిస్టేబుల్ కూడా ఉండటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పేకాట నిర్వహణ విషయంలో కానిస్టేబుల్ పాత్రపై విచారణ చేపట్టి రామాంజులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

బాలుడిపై లైంగిక దాడి కేసులో నిందితుడు అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు


సంబేపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన 9 ఏళ్ల బాలుడుపై తిరుపతి రమేశ్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన సంఘటనలో నిందితుడిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.... రమేశ్ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. 28వ తేదీ బాలుడు ఇంటి ముందు సైకిల్ తొక్కుకుంటున్న సమయంలో బాలుడిని అపహరించి అతనిపై లైంగిక దాడికి పాల్పడడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు తిరుపతి రమేశ్‌ను అరెస్టు చేసి ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ముందు హాజరుపరిచి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

వేలం ద్వారా రూ.10 లక్షల ఆదాయం

పెద్దమండ్యం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలంలో వారపు సంతల నిర్వహణకు శనివారం నిర్వహించిన వేలం ద్వారా రెండు గ్రామ పంచాయతీలకు రూ.10.12 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, శేషాద్రి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పెద్దమండ్యం వారపు సంత నిర్వహణకు విశ్వనాథ రూ.6.40 లక్షలు అత్యధికంగా వేలం పాట పాడగా, బస్టాండ్ గేట్ వసూలుకు రఫీ రూ.78 వేలకు, తురకపల్లి వారపు సంతకు ఉమర్ రూ.2.34 లక్షలు, పసలబండ గేటు వసూలుకు వెంకటరమణ రూ.60 వేలు వేలం ద్వారా దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు.

మందుబాబుల అడ్డా పెద్దచెరువు





కోడూరు పెద్ద చెరువు గట్టుపై పగలు, రాత్రి మద్యం తాగుతున్న మందుబాబులు

రైల్వేకోడూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కోడూరు పెద్ద చెరువు అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ప్రతిరోజూ సాయంత్రం కాగానే చెరువు వద్దకు మందుబాబులు చేరుకుని మద్యం తాగుతూ చిందులేస్తున్నారు. కోడూరు పెద్ద చెరువు దగ్గర గుండాలపల్లె, పాటిమీదిపాళెం, బయనపల్లె, అగ్రహారం, రెడ్డివారిపల్లె తదితర ప్రాంతాలకు సమీపంలో ఉంది. ఆటోలు, మోటారు బైకుల్లో వస్తున్న మందుబాబులు ఇక్కడ ఆగి మద్యం తాగుతున్నారు. ఇక్కడ ఓ ప్రైవేటు స్కూలు ఉంది. స్టడీ అవర్ చూసుకుని విద్యార్థులు ఆయా గ్రామాలకు రాత్రి 7 గంటలకు వెళుతుంటారు. ఆకతాయిలు, మందు బాబులు ఇక్కడ హల్‌చల్ చేస్తుంటారు. దీంతో ఇటు విద్యార్థులు, అటు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి 10 గంటల వరకు మందుబాబులు ఉంటున్నారు. తాగి చిందులు వేయడంతో పాటు బూతు పురాణాలు చేస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అనే తేడా లేకుండా పెద్దచెరువు మద్యం తాగుతున్నారు. పోలీసులు ఇక్కడ నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాథమిక విద్యలో సమూలాల మార్పులు

- నాణ్యమైన విద్యే లక్ష్యం
- క్రీడలకు ప్రాధాన్యత

కూటమి సర్కారు కసరత్తు



కడప ఎడ్యుకేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మారుస్తామని.. నాణ్యమైన విద్యనందిస్తామని ప్రకటించింది. కానీ ఆచరణలో విఫలమైంది. ఉపాధ్యాయులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఇబ్బందులకు గురయ్యారు. వాటన్నింటికీ చెక్ పెట్టే విధంగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు.

క్రీడల్లోనూ రాణించేలా...

గత ప్రభుత్వ హయాంలో పెద్ద గుదిబండగా ఉపాధ్యాయ లోకం భావించిన 117 జీవోను రద్దు చేయడంతో ఆ వర్గాలు ఊపిరి పీల్చుకుంటున్నాయి. గత ప్రభుత్వం 3,4,5 తరగతులను సమీపంలోని హైస్కూళ్లలో విలీనం చేయడంతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. నూతన ప్రభుత్వ హయాంలో విలీనం ప్రక్రియను వెనక్కి తీసుకోవడంతో ప్రాథమిక విద్యారంగం మళ్లీ ఊపిరి పోసుకుంటోందన్న భావన బలపడుతుంది. విద్యతో పాటు విద్యాయేతర రంగాల్లో క్రీడలు, ఇతర అంశాల్లో రాణించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పక్కాగా ప్రణాళికలు

వచ్చే విద్యాసంవత్సరం నుంచి గతంలో మాదిరిగా ఎక్కడి పాఠశాలలు అక్కడే అన్నట్లుగా నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాలలను తెరిచిన వెంటనే కొన్ని రోజుల పాటు రెడీనెస్ విధానాన్ని అమలు చేయను న్నారు. కనీస అభ్యసనా సామర్థ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఈ నూతన విధానాన్ని అమలు చేయ నున్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో 45 మంది విద్యార్థులు కలిగి న పాఠశాలలను మోడల్ స్కూళ్లగా పరిగణించి అక్కడ జాతీయ నూతన విద్యావిధానానికి అనుగుణంగా ప్రణాళికలను అమలు చేయనున్నారు. ప్రాథమిక పాఠశాలలను కనీసం 20 మంది విద్యా ర్థులతో నిర్వహిస్తారు.

విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం



వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు రానున్నాయి. మోడల్‌స్కూలు వ్యవస్థ వస్తుంది. ఉపా ధ్యాయులు లేని తరగతులు, పాఠ శాలలు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటా రు. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

\- షంషుద్దీన్, డీఈవో

తరగతికి ఒక టీచర్

ఇక మీదట ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకుంటారు. యూపీ స్కూళ్ల వ్యవస్థకు పూర్తిగా మంగళం పలుకుతారు. ఒకవేళ నడపాల్సి వస్తే స్కూలు అసిస్టెంటు లేకుండా ముగ్గురు ఎస్జీ టీలతో వీటిని నిర్వహిస్తారు. మిగిలిన స్కూళ్ల న్నింటి నీ విద్యార్థుల సంఖ్య ఆధారంగా హైస్కూళ్లుగా అప్ గ్రేడ్ చేస్తారు. విద్యాహక్కు చట్టం కింద ప్రతి విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున పది నెలల పాటు రవాణా ఖర్చులు చెల్లిస్తారు.

లీప్ పాఠశాలలు

నియోజకవర్గానికి ఒకటి చొప్పున 5 అంశాల ప్రాధాన్యంగా లీప్ పాఠశాలలను ప్రవేశపెట్టనున్నారు. ప్రతి పౌరునికి సమాన సమ్మిళిత విద్యను అందించడం, లింగ నిష్పత్తిని పెంచడం, దివ్యాంగులకు సదుపాయాలు కల్పించడం, విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధి కోసం నైపుణ్యాలను పెంపొందించడం, పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలను పెంచడం వంటివి అమలు చేస్తారు. నాలెడ్జి ఎకనామీ, సృజన, పరిశోధన వంటివి పెంచడం, ప్రపంచ ప్రమాణాలతో కూడిన పాఠ్య ప్రణాళికను అమలు చేయనున్నారు. సర్కారు బడుల్లో ప్రవేశాలకు పోటీ పడే విధంగా రాబోయే రోజులు ఉంటాయని మంత్రి లోకేశ్ చెబుతున్నారు.

జేబీజేఎస్ ద్వారా విజయవంతంగా కీళ్ళమార్పిడి

ఎముకలు, రోబోటిక్ కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ విద్యాసాగర్



కడప మారుతీనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా పేరు గడించిన జోర్నల్ ఆఫ్ బోన్ అండ్ జాయింట్ సర్జరీ (జేబీజేఎస్) ద్వారా మోకాళ్ళ అరుగుదల సమస్యకు సరికొత్త విధానంలో తక్కువ ఖర్చుతో విజయవంతంగా కీళ్ళ మార్పిడి చేయడం జరుగుతుందని ఎముకలు, రోబోటిక్ కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. శనివారం స్థానిక మారుతీనగర్‌లో గల విద్యాసాగర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకూ సుమారు 7వేలకు పైగా మోకాలు కీళ్ళ మార్పిడి చేసిన అనుభవంతో చేసిన ఈ సర్జరీ అనుభవంతో ఆర్టికల్ (టోటల్ నీ ఆర్థోప్లాస్టీ విత్ ల్యాటరల్ ఫెమోరల్ ఎపికాన్‌డేలర్ ఓస్టెటోమై ఇన్ ఎ నీ విత్ సర్వ్ ఎక్స్ట్రా-ఆర్టికులర్ వేరస్) కేసు రిపోర్ట్ లో తనకు, సిబ్బందికి ఎంతో గర్వకారణంగా వుందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరెన్నో అంతర్జాతీయంగా ఏర్పాటుకానున్న రీసెర్చ్, సెమీనార్లలో పాల్గొనడం ద్వారా ఆధునిక విధానాలపై పట్టు సాధించి తద్వారా ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలతో చికిత్సలను తక్కువ ఖర్చుతో అందించాలన్నదే తమ ధ్యేయమన్నారు. కాగా అంతర్జాతీయంగా తమ హాస్పిటల్ పేరు రావడంలో అన్ని విధాల సహకరిస్తున్న డాక్టర్ లక్ష్మీ, ఇతర సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

బి.ఫార్మసీ, ఫార్మ్-డి విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నిర్మల ఫార్మసీ కళాశాల లో కేరళ రాష్ట్రం కొచ్చి సంబంధించిన జీన్ అకాడమీ అనే సంస్థ ద్వారా బీఫార్మసీ, ఫార్మడీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీనివాసులు సదస్సు ప్రాముఖ్యత తెలిపారు. అనంతరం జీన్ అకాడమీ సభ్యులు డైరెక్టరు మంజూషాగోష్, వీసా ఆపరేషన్స్ మేనేజరు కిరణ్‌జోష్, అకడమిక్ కోఆర్డినేటరు డాక్టర్ మెరిన్‌షారా, ఫిలిప్ విద్యార్థులతో విదేశాల్లో ఫార్మసీ ప్రాధాన్యత, ఉద్యోగావకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌కుమార్, డీన్ అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

కడప సెవెన్‌రోడ్స్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ పథకం తాలూకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఎఎస్‌హెచ్‌ఏ) జిల్లా శాఖ ప్రతినిధులు కోరారు. ఆ మేరకు శనివారం కడప కలెక్టరేట్‌లో డీఆర్‌ఓను కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు.

రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారానికి జింకా సుబ్రమణ్యం ఎంపిక



ప్రొద్దుటూరు టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేసే రాష్ట్రస్థాయి 2025 ఉగాది పురస్కారానికి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం ఎంపికయ్యారు. గత నాలుగున్నర దశాబ్దాలుగా ఆయన సాహితీరంగంలో విశేష కృషి చేస్తున్నారు. వందల సంఖ్యలో సాహితీ సభలు నిర్వహించారు. ప్రముఖులు నిర్వహించిన అవధానాలలో పృచ్ఛకులుగా వ్యవహరించారు. ఆకాశవాణిలో వందకుపైగా కవితలు, ప్రసంగాలు, సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొద్దుటూరులో పుట్టపర్తి నారాయణాచార్యులు, తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటుకు, తెలుగు మహాసభల నిర్వహణకు కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఉగాది పురస్కారానికి ఎంపిక చేయడం పట్ల పలువురుసాహితీమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

గానుగపెంట హనుమంతరావుకు...



బద్వేలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బద్వేలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, విద్వాన్ గానుగపెంట హనుమంతరావుకు రాష్ట్ర ప్రభుత్వం తెలుగు ఉగాది పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు సాంస్కృతిక శాఖ నుంచి శనివారం ఫోన్ ద్వారా ఆహ్వానించారు. ముప్పైఆరున్నర సంవత్సరాలు తెలుగు పండితులుగా పనిచేసి మాతృభాషాభివృద్ధికి కృషి చేశారు. 2005లో పదవీ విరమణ చేసిన ఆయన రాష్ట్రపతిచే పండితరత్న సాహిత్య అవార్డు, జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈ పురస్కారం అందజేయడం పట్ల ఆయన మిత్రులు, శిష్యులు హర్షం వ్యక్తం చేశారు.

వేంపల్లె షరీఫ్‌కు...



వేంపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కథా రచయిత, సాహితీ అకాడమీ పురస్కార గ్రహీత వేంపల్లె షరీఫ్ ఉగాది పురస్కా రానికి ఎంపికయ్యారు. ఆదివారం ఉగాది పర్వదిన సందర్భంగా తుమ్మలపల్లె కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోనున్నట్లు అవార్డుకు ఎంపికైన షరీఫ్ తెలిపారు. ఈ ఉత్సాహంతో కొత్త కథా రచనలను రచిస్తామని ఆయన తెలిపారు.

రోడ్డుభద్రతపై అవగాహన

కడప (క్రైం)మార్చి29(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు రోడ్డుభద్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ పరిధుల్లో వాహన దారులు, విద్యార్థులకు ట్రాఫిక్ నియమనిబంధనలపై సూచనలు చేశారు.

కాలం చెల్లిన మద్యం బాటిళ్లు ధ్వంసం... కడప నగరం ఐఎంఎల్ డిపో లో 33 రకాల బ్రాండ్స్‌కి చెందిన 9610 లీటర్లమద్యాన్ని ఎక్సైజ్ అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు.

జీఎస్టీ, వీఏటీ పన్నులను చెల్లించాలి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున జీఎస్టీ, వీఏటీ, సీఎస్‌టీ పన్నులను రాబోవు రెండురోజుల్లో జమ చేయాలని జాయింట్ కమిషనరు జి.కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించేం దుకు అవకాశం ఉందని అన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయండి

కడప కల్చరల్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలను పురష్కరించుకుని శిల్పారామంలో ఈనెల 30, 31, వచ్చే ఏప్రిల్ 6, తేదీలలో జరుపతల పెట్టిన విభిన్నమైన సాంస్కృతిక కార్యక్రమాలను విజయ వంతం చేయాలని శిల్పారామం పరిపాలనాధికారి యస్. క్రిష్ణ ప్రసాద్ నగర ప్రజలను కోరారు. శనివారం స్థానిక కోటిరెడ్డి సర్కిల్‌వద్ద గల స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయన మాట్లాడుతూ ఉగాది రోజున సాయంత్రం సాయిరామ్ ఇంగ్లీషు మీడియం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. రంజాన్ రోజు ఢీ బుల్లితెర డ్యాన్స్ మాస్టర్స్‌చే సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీరామ నవమి రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

నూతన బోర్లు ఏర్పాటు

వేంపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం నూతన బోర్లను ఏర్పాటు చేసి అందులో కొత్త మోటార్లను బిగించారు. రాజీవ్‌నగర్ కాలనీ, పులివెందుల రోడ్డులోని శ్లోకో స్కూలు సమీపంలో వేసిన బోర్లకు శనివారంకొత్త మోటార్లు బిగించారు.

'తిరుమల క్షేత్రంపై ప్రభుత్వ నిర్లక్ష్యం'

కడప, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అత్యంత పవిత్రమైన తిరుమలలో బెల్టుషాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయించడం తిరుమల పవిత్రతకు భంగం కలిగించినట్లేనని తెలుగునాడు ప్రజాసేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వైసీపీ రాష్ట్ర నాయకుడు సత్యసాయినాథ్‌శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమలాపురంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుమల క్షేత్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మద్యం విక్రయాలు జరగడం.. పోలీసులు దాడి చేసి శనివారం మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేయడం గమనిస్తుంటే కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబించినట్లు అర్థమవుతోందన్నారు.

గండి అంజన్నను దర్శించుకున్న జడ్పీ చైర్మన్

చక్రాయపేట/ వేంపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయ స్వామిని జిల్లాపరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కావలి క్రిష్ణతేజ, చక్రా యపేట జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కేసరి, రాజారమేశ్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం జడ్పీచైర్మన్ తన కుటుంబ సభ్యులు, ఇతర నాయకులతో కలిసి ఇడుపులపాయ వైఎస్ ఆర్ ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. జడ్పీ వైస్‌చైర్మన్ బాలయ్య, చక్రాయపేట ఎంపీపీ మాధవీ, ఏపీ ఆగ్రోస్ మాజీ అధ్యక్షుడు చెన్న క్రిష్ణారెడ్డి, జడ్పీటీసీలు బయపురెడ్డి, సుమిత్ర రాజశేఖర్‌రెడ్డి, వీరపునాయునిపల్లె ఎంపీపీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో ఆత్మరక్షణకు విలువైన ఆయుధం

కడప ఎడ్యుకేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జ్ఞానంతో పాటు శారీరక, మానసిక వికాసంతో ఆత్మస్థైర్యం గల యువత తయారవుతారని వైస్‌చా న్స లర్ ప్రొఫెసరు అల్లం శ్రీనివాసరావు అన్నారు. శనివారం వైవీయూ వసతి గృహాల విద్యార్థినులకు క్యాంపస్‌లో రెండో విడత తైక్వాండో శిక్షణ తరగతుల ముగింపు సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్, హాస్టళ్ల చీఫ్ వార్డెన్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ మాట్లాడుతూ తైక్వాండో ఆత్మరక్షణకు, ఆత్మవిశ్వాసానికి ఆయుధమని అన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందించారు.

సబ్‌జైలులో ఆకస్మిక తనిఖీ

పులివెందుల టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పులివెందుల సబ్ జైలును జిల్లా సివిల్ జడ్జి షేక్ బాబా ఫకృద్దీన్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్‌జైలులో మౌలిక వసతులు పరిశీలించారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత సాయం, లీగల్, డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. పులివెందుల బార్ అసోసియేషన్ న్యాయవాదులు కిశోర్ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ అయ్యవారురెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులను వేధించడం తగదు'

కడప ఎడ్యుకేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ పరీక్షల్లో రాష్ట్ర వ్యాప్తంగా సస్పెండ్ చేసిన ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకో వాలని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరో చేసిన తప్పులకు ఉపాధ్యాయులను బలి చేయడం సరికాదన్నారు. శ్రీకాకుళం, వల్లూరు, వేంపల్లె, ఇతర ప్రాంతాల్లో ఎవరో చేసిన తప్పులకు ఉపాధ్యాయులు బలి అయ్యారన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం అసలైన దోషులను శిక్షించాలే కానీ ఉపాధ్యాయులను సస్పెండ్ చేసి జైలుకు పంపడం సరైన పద్ధతి కాదన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు




కడప..ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి, గోవర్ధనరెడ్డి, పులివెందుల..టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవితదితరులు



కడపలో టీడీపీ జెండా ఎగురవేస్తున్న ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి




లింగాలలో టీడీపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నిర్మాణానికి కార్యకర్తలే మూలస్తంభాలని కడప నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవీ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి అన్నారు శనివారం కడప నగరం ఎన్టీఆర్ సర్కిల్‌లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా ఎన్టీఆర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. కార్యకర్తల మధ్యన భారీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వికాస్ హరిక్రిష్ణ ఆధ్వర్యంలో..: కడప నగరం 45వ డివిజను టీడీపీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరిప్రసాద్ ఆధ్వర్యంలో..: కడపనగరం 43వ డివిజనులో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో 23, 43, 44 డివిజన్ల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

కడప మారుతీనగర్..: టీడీపీతోనే తెలుగువారి ఆత్మగౌరవం సాకారమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.యస్. అమీర్‌బాబు, నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ జి. లక్ష్మిరెడ్డి, అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీడీపీ రాష్ట్ర వాణిజ్యసెల్ ప్రధాన కార్యదర్శి సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్థానిక 12వ డివిజన్ సానపురెడ్డి హరినారాయణరెడ్డి కాలనీలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎన్. శివ రామ్, ప్రేమ్‌కుమార్, టి. ప్రసాద్, ఎం.రామాంజనేయులు, జనార్ధన్‌రెడ్డి,వెంకటేష్‌యాదవ్,గంగరాజు,అల్లాబకాష్ పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: తెలుగువారి ఆత్మగౌరవం కాపాడడం కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని ఆ పార్టీ రాష్ట ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా శనివారం కార్యకర్తలతో కలిసి ఆయన టీడీపీ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాషా, వాసుదేవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, జంపాల నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మస్తానయ్య, రెడ్డికరీం, వేణుగోపాల్‌రెడ్డి, మల్లేశ్‌రాయల్, నాగేశ్వర ప్రసాద్‌రెడ్డి, సూర్యసుబ్బారెడ్డి, గుజ్జుల నారాయణ, చంద్రశేఖర్ రెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, సవ్యసాయి, బాబుల్ పాల్గొన్నారు.

చెన్నూరు..: టీడీపీ పేదల కోసం పుట్టిన పార్టీ అని మండల టీడీపీ కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ టి.వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి, మాజీజడ్పీటీసీ చిన్నయ్య, టీడీపీ సీనియర్ నేతలు కొండపేట మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంజీవ్,పవన్, మల్లికార్జునరెడ్డి, షబ్బీర్‌హుస్సేన్, గౌస్‌పీర్, ఆటోబాబు, ముండ్లనరసింహారెడ్డి,ఆవుల పవన్ కుమార్ రెడ్డి, కొక్కిరాయపల్లె సర్పంచ్ సూర్యనారాయణ, బాలక్రిష్ణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, కొండాల చెన్నయ్య,డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య ఖాజాహుసేన్, మంజూరు అహ్మద్ పాల్గొన్నారు.

వల్లూరు..: మండలంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా గాంధీ బొమ్మ వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి మాజీ ఎంపీటీసీ రామక్రిష్ణారెడ్డి, రమణారెడ్డి, రామక్రిష్ణుడు, మధు సూదనరెడ్డి, రామయ్య, ఓబులేసు, సురేశ్, ఈశ్వర్‌రెడ్డి, సత్యనారా యణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సద్దాం, చిట్టిబాబు, సురేంద్ర, పాల్గొన్నారు.

పెండ్లిమర్రి..: మండలంలోని పెండ్లిమర్రి,నందిమండలం గ్రామాలలో శనివారం తెలుగుదేశం పార్టి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, శ్రీధర్ రెడ్డి,బయన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె..: మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల టీడీపీ కన్వీనరు బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మండల మాజీ ఎంపీపీ నారెడ్డి ప్రసాద్‌రెడ్డిఅధ్యక్షతన జెండాను ఎగరవేశారు. రామేశ్వరం ఆలయ మాజీ చైర్మన్ మురళీ మోహన్ రెడ్డి, తలపనూరుగంగిరెడ్డి, వీఎన్‌పల్లె అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పులివెందుల టౌన్..: తెలుగుదేశంపార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శనివారం పులివెందుల పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగ రవేశారు. ఈ కార్యక్రమంలో బీటెక్ సతీ మణి లతారెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి నివాసం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎమ్మెల్సీ సతీమణి ఉమాదేవి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, మైసూరారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.



కమలాపురంలో జెండా ఎగురవేస్తున్న పుత్తానరసింహారెడ్డి











పులివెందులలో కేక్ కట్ చేస్తున్న ఉమాదేవి

వేంపల్లె..: వేంపల్లె టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి ,మండల కన్వీనరు మునిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు షబ్బీర్, నామా వేమకుమార్ పాల్గొన్నారు.

సీకేదిన్నె..: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలో నిర్వహించారు. చింతకొమ్మదిన్నె, కొలుములపల్లె, నాగిరెడ్డిపల్లె, ఇప్పెంట, తాడిగొట్ల, కొప్పర్తి, తదితర పంచాయతీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, నజీర్, రాజా, శంకర్‌రెడ్డి, రమణయ్య, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లింగాల..: లింగాలలో శనివారం టీడీపీ ఆవిర్భావ వేడుకలు ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి మండల నాయకులు సంజీవరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి పార్టీ జెండా ఆవిష్కరించారు.

బెంచీలకు పలకలు తగిలించారు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి29(ఆంధ్రజ్యోతి):వివిధ రకాల పనుల కోసం కలెక్టరేట్ వస్తున్న ప్రజలు కూర్చునేందుకు వీలుగా దాతలు సిమెంట్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. అయితే ఆ బెంచీలకు రాజకీయ నాయకుల పేర్లు ఉండటంతో ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్న కారణంతో గత ఏడాడి తొలగించారు.తిరిగి వాటిని తగిలించకపోవడంతో ఇదే విషయాన్ని ఈ నెల 26 న తొలగించారు... తగిలించడం మరిచారు అనే శీర్షికను ఆంధ్రజ్యోతిలో వార్త వెలువడింది. దీంతో స్పందించిన అధికార యంత్రాంగం బెంచీలకు పలకలు తగిలించారు.



తెలుగు మాధ్యమానికి రిజర్వేషన్ ఇవ్వాలి

వేంపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు మాధ్యమంలో చదివే విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 3 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్యఅధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి ఒక ప్రకటనలో రాష్ట ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రపదేశ్‌ను ఆంగ్ల ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ జీవో ఇవ్వడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆ జీవో రద్దు చేయకపోవడం దారుణమన్నారు.

సెలవుదినంలో కూడా ఆస్తి పన్ను చెల్లించవచ్చు

కమలాపురం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగ రోజుల్లో సెలవు దినం ఉన్నా కానీ ఆస్తి పన్నులు చెల్లించవచ్చని నగర పంచయాతీ కమిషనరు పగడాల జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలాంతరపు రోజులు కాబట్టి ఉగాది, రంజాన్ సెలవుల్లో కూడా ఆస్తి పన్ను కట్టే వీలు కల్పించినట్లు కమిషనరు తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో ఉదయం 6గంటల నుంచి రాత్రి 9 వరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారని, ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఆ కౌంటరులో చెల్లించవచ్చని తెలిపారు.

S. No.	Borrower Name and Address	Goods Name	Receipt Number	Receipt Date	Number of Bags	Approx. Weight	Loan a/c No.	Loan Amount
1	THAPPETA BHASKAR REDDY & SRI LAKSHMI SUBRAMANEYESWARA WARE HOUSE	PADDY	712	13/02/2024	460 Bags	34,500 Kgs	1608	4,36,269/-Rs
2	THAPPETA BHASKAR REDDY & SRI LAKSHMI SUBRAMANEYESWARA WARE HOUSE	PADDY	713	13/02/2024	550 Bags	37,500 Kgs	1610	5,92,783/-Rs
3	THAPPETA BHASKAR REDDY & SRI LAKSHMI SUBRAMANEYESWARA WARE HOUSE	PADDY	714	13/02/2024	450 Bags	33,750 Kgs	1613	4,26,802/-Rs
4	THAPPETA BHASKAR REDDY & SRI LAKSHMI SUBRAMANEYESWARA WARE HOUSE	PADDY	715	13/02/2024	500 Bags	37,500 Kgs	1612	4,74,229/-Rs
5	CHINTHAKUNTA SUBBARAYUDU & SRI LAKSHMI SUBRAMANEYESWARA WARE HOUSE	PADDY	708	13/02/2024	500 Bags	37,500 Kgs	1615	5,92,783/-Rs
6	CHINTHAKUNTA SUBBARAYUDU & SRI LAKSHMI SUBRAMANEYESWARA WARE HOUSE	PADDY	709	13/02/2024	490 Bags	36,750 Kgs	1614	4,64,742/-Rs
7	CHINTHAKUNTA SUBBARAYUDU & SRI LAKSHMI SUBRAMANEYESWARA WARE HOUSE	PADDY	710	13/02/2024	480 Bags	36,000 Kgs	1611	4,55,256/-Rs
8	CHINTHAKUNTA SUBBARAYUDU & SRI LAKSHMI SUBRAMANEYESWARA WARE HOUSE	PADDY	711	13/02/2024	500 Bags	37,500 Kgs	1609	4,74,229/-Rs

పేదల అండ.. టీడీపీ జెండా

- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకాలు, ఘన నివాళులు
- టీడీపీ జెండాలను ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్న పార్టీ శ్రేణులు


ప్రొద్దుటూరులో ఎన్టీఆర్‌కు నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి


మైదుకూరులో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ప్రొద్దుటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) పేదల అండ దండా తెలుగుదేశం పార్టీ జెండా అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం 43వ టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా పొట్టి పాడు రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వరదరాజులరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ 43 వసంతాలు పూర్తిచేసుకోవడం తెలుగు జాతి చరిత్రలో గొప్ప చారిత్రక ఘట్టం అన్నారు. కోటి మంది కార్యకర్తల బలం కలిగిన పార్టీగా యుగపురుషుడు మాజీ ముఖ్యమంత్రి అన్న ఎన్టీరామారావు తెలుగు వారిఆత్మగౌరవ ప్రతీకగా టీడీపీ ని నిలపారన్నారు. 1982 మార్చి 29న ఏర్పడిన ఈ పార్టీ జాతీయ రాజకీయాల్లో నూ నేడు కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. సీఎం నారా చం ద్రబాబు నాయుడు నాయకత్వంలో దక్షిణాది రాష్ట్రాల్లో బలమైన పార్టీగా టీడీపీని నిర్మించా రన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్లు వీఎస్‌ముక్తియార్, ఆసం రఘురామిరెడ్డి, మాజీమున్సిపల్ వైస్‌ఛైర్మన్ జబివుల్లా, టౌన్ బ్యాంకు ఛైర్మన్ సుబ్బారెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ శివచంద్రారెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు,మున్సిపల్ కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి మండల టీడీపీ కన్వీనర్ బాబుల్‌రెడ్డి, నందమూరి యువ సేన సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.


బద్వేలులో టీడీపీ జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి


జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

తెలుగుజాతి కీర్తిని చాటిన టీడీపీ

తెలుగు జాతి కీర్తిని ఢిల్లీకి చాటిన పార్టీ తెలుగుదేశం అని మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు ముదిరెడ్డిపద్మనా భరెడ్డి, మోపూరి చంద్రారెడ్డి, కర్నాటి గురివిరెడ్డి, వెంకటలక్ష్మీ, ఆవుల రామిరెడ్డి, టప్పామహబూబ్‌బాషా, సుబ్బరాజు దేశిరెడ్డి పాల్గొన్నారు. తెలుగుజాతి గౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీ యుడు స్వర్గీయ ఎన్టీరామారావు అని టీడీపీ కడప పార్ల మెంటరీ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి అన్నారు.

తెలుగుదేశం బడుగు బలహీన వర్గాల పార్టీ

మైదుకూరు రూరల్/ ఖాజీపేట, మార్చి29(ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడే పార్టీ తెలుగుదేశం అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. తెలుగుదేశం 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక బద్వేల్ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు పార్టీ జెండాను శనివారం ఎమ్మెల్యే ఆవిష్క రించా.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుట్టా మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగుగంగా ప్రాజెక్ట్ ద్వారా నీటిని అందించారని దీంతో నేడు మైదుకూరులో తాగునీ టి, సాగునీటి ఇబ్బందులు లేవన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ఏపీ రవీంద్ర, దనపాల జగన్, ఆర్‌శ్రీనివాసులు, యాపరాల లక్ష్మీనారాయణ, మారుతీ, మిల్లు శ్రీను, పుట్టా ప్రభాకర్ యాదవ్, తుపాకుల రమణ, బండి అమర్‌నాద్, వీరారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు ఖాజీపేట మండలం పుల్లూరులో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ టీడీపీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, నాయకులు నంద్యాల సుబ్బయ్య, ప్రతాప్‌రెడ్డి, బొగ్గుల చంద్ర ఓబుళరెడ్డి, నాగశివారెడ్డి, ఫరూక్, సిద్దారం కదిరుల్లా, హబీబ్, జలీల్, హరినాథరెడ్డి, శంకర్‌రెడ్డి, దుంపల గట్టు రవి, గోవిందు సుబ్బయ్య పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ: మండల పరిధిలోని చెముళ్లపల్లె ఎస్సీ కాలనీకి చెందిన సుబ్బలక్ష్మి, ఓబుళమ్మ, రమణమ్మ, రేణుక, గంగాదేవి కుటుంబాలకు రెండు సెంట్ల స్థలాల పట్టాలను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అందజేశారు.

బద్వేలు/టౌన్‌లో: తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం అన్న స్వర్గీయ నందమూరి తారకరామారావు చేతులమీదుగా పురుడుపోసుకున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. శనివారం టీడీపీ 43వ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా పట్టణంలోని నెల్లూరురోడ్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ర్యాలీగా వచ్చి మైదుకూరురోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ ఆవిర్భావం నుంచి జెండామోసిన సీనియర్ నాయకులను మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి, బొజ్జ రోశన్నలు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, కనుమర్లపూటి ప్రసాద్, కొలవలివేణుగోపాల్, జీవి సుబ్బారెడ్డి, సీనియర్ న్యాయవాది పీవీఎన్ ప్రసాద్, ఊట్ల సుబ్బరామయ్య, శివయ్యస్వామి నరసింహానాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఎర్రగుంట్ల మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పోట్లదుర్తిలోని ఎన్‌టీఆర్ కాలనీలో ఉన్న ఎన్‌టీఆర్ కాంస్య విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేష్‌నాయుడు పూలామాల వేసి, నివాళులర్పించారు. అనంతరం టీడీపీ జెండాను ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు, సర్పంచి నరసింహులు, ఎంపిటీసీ పి.ప్రతాప్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, సుబ్బరాయుడు, నాగరాజు, రామక్రిష్ణనాయుడు, తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.

జమ్మలమడుగులో: తెలుగు జాతి గర్వపడే తెలుగుదేశం పార్టీని స్వర్గీయ నందమూరి తారకరామారావు ఆవిర్భవించి 43 సంవత్సరాలు పూర్తి చేసుకుందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంబాపురం రమణారెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, సూర్యరాయల్, బీరు సంతోష్, నట్లగట్ల భూసిరెడ్డి, పొన్నతోట శ్రీను, దిండు నాగేశ్వరరెడ్డి, జమాల్, కుళాయప్ప, పిలీప్, లోటన్‌సాగారి ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో: టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలో వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దువ్వూరులో: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడులను పార్టీ మండల నాయకులు వెంకటరమణారెడ్డి, పానినేని రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు.

యువకుడు అదృశ్యం


గురుప్రసాద్ (ఫైల్‌ఫొటో)

మైలవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గద్దే గురుప్రసాద్ అనే యువకుడు ఈనెల 27వ తేదీ నుంచి కనిపించడంలేదని గురుప్రసాద్ భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మైలవరం ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు మైలవరంకు చెందిన గురుప్రసాద్ తొర్రివేముల సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నాడు. ఇంటిలో సమస్యల కారణంగా ఈనెల 27వ తేదీ రాత్రి 11 గంటలకు ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోవడంతో ఎంతవెతికినా కనిపించకపోవడంతో భార్య మైలవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురుప్రసాద్‌కు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శుల నిరసన

దువ్వూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్యదర్శులు నిరసన వ్యక్తపరిచారు. వీరపునాయునిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి ఇంటిపై దాడిని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. దాడులవలన విధులు నిర్వహించాలంటే ఆత్మస్థైర్యం కోల్పోతున్నామన్నారు. అనంతరం ఎంపీడీవో రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేసి బాద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మానసిక వికలాంగుల పట్ల నిర్లక్ష్యం తగదు

ముద్దనూరు మార్చి29(ఆంధ్రజ్యోతి):మానసిక వికలాంగుల పట్ల నిర్లక్ష్యం తగదని పలువురు వాపోతున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చిన దివ్యాంగులు, మానసికవికలాంగులు , వృద్ధులు పట్ల ఆధార్ అప్‌డేట్ చేసే సిబ్బంది నిర్లక్ష్యం వస్తున్నారని బాధితులు వాపోతున్నారు.ఆధార్ అప్‌డేట్ కోసం కాండ్లీపల్లెకు చెందిన వంగల వీరరాఘవరెడ్డి తన కుమారుడైన వీరనాయణరెడ్డిని శనివారం తీసుకొని రాగా ఆధార్ అప్‌డేట్ చేయు సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. .పింఛన్ విషయంలో ఇప్పటి వరకు సమస్యరాకున్నా, అధికారులు ఇంటి పేరు మారి ఉండటం వల్ల సమస్య వస్తుందని తెలుపడంతో ఆధార్ అప్‌డేట్ చేసుకొనేందుకు వచ్చామన్నారు. తన కుమారుడికి డీఎంహెచ్‌ఓ పింఛను మంజూరు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

ముస్లీం మైనారిటీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

బద్వేలుటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : ముస్లీం మైనారిటీల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి అన్నారు. శనివారం రంజాన్‌మాసంలో ఉపవాసం ఉన్న ముస్లీంలకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మసీదులో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ మహబూబ్‌బాషా, సాయికిరణ్‌రెడ్డి, నరసింహానాయుడు, పీఆర్‌పీ బాషా, పీపీఎస్ ప్రసాద్, రమణ, గోపాల్‌రెడ్డి, షరీఫ్, జహంగీర్‌బాషా, ప్రసాద్, రసూల్, పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఐదురోడ్ల కూడలి నందు 43వ టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. కాగా రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నందిపల్లె టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గానుగపెంట, జింకాలకు ఉగాది పురస్కారం


గానుగపెంట హనుమంతరావు


జింకా సుబ్రమణ్యం

బద్వేలు /ప్రొద్దుటూరు టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బద్వేలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, విద్వాన్ గానుగపెంట హనుమంతరావుకు విశ్వావసు నామ సంవత్సర ం తెలుగు ఉగాది పురస్కారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సాంస్కృతిక శాఖ నుంచి శనివారం ఫోన్ ద్వారా ఆహ్వానించినట్లు తెలిపారు. ముప్పైఆరున్నర సంవత్సరాలు వివిధ రూపాలలో తెలుగు పండితులుగా పనిచేసి మాతృభాషాభివృద్ధికి కృషిచేశారు. 2005లో పదవి విరమణ చేసిన ఆయన రాష్ట్రపతిచే పండితరత్న సాహిత్య అవార్డు, జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఇందులో భాగంగా ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈ పురస్కారం అందజేయడం పట్ల ఆయన మిత్రులు, శిష్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందజేసే రాష్ట్రస్థాయి 2025 ఉగాది పురస్కారానికి కడపజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం ఎంపికయ్యారు. గత నాలుగున్న దశాబ్దాలుగా ఆయన సాహితీరంగంలో విశేష కృషి చేస్తున్నారు. వందల సంఖ్యలో సాహి తీ సభలు నిర్వహించారు. ప్రముఖులు నిర్వహించిన అవధానాలలో పృచ్ఛకులుగా వ్యవహరించారు. ఆకాశవాణిలో వందకుపైగా కవితలు, ప్రసంగాలు, సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొద్దుటూరులో పుట్టపర్తి నారాయణాచార్యులు, తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటుకు ఎంతో కృషి చేశారు. తెలుగు మహాసభలను నిర్వహించడానికి కృషి చేశారు. ఆయన ఉగాది పురస్కారానికి ఎంపిక కావడంపట్ల సాహితీమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

చేనేత విభాగం అధికార ప్రతినిధిగా చంద్రమౌళి

జమ్మలమడుగు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణానికి చెందిన వైసీపీ చేనేత విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా బండిగించల చంద్రమౌళిని నియమించారు. అలాగే రాష్ట్ర ఎస్సీసెల్ జనరల్ సెక్రటరిగా ఎస్.ఉప్పలపాడుకు చెందిన ఉప్పలపాటి యోబు, జనరల్ సెక్రటరి కొర్రపాటి శరత్‌బాబు, సెక్రటరీగా త్యాగరాజు, కె.బాస్కర్, ఎం.సుబ్బరాయుడు, రాష్ట్ర వాలంటీర్స్ విభాగం సెక్రటరిగా పగిడాల ప్రసాద్‌రెడ్డి, మిద్దె సురేష్, జాయింట్ సెక్రటరిగా అంబటి నాగ మల్లారెడ్డి, ఎంప్లాయిస్ జనరల్ సెక్రటరిగా కె.చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర చేనేత జనరల్ సెక్రటరి జనార్ధన్, ఆంజనేయులు, జాయింట్ సెక్రటరి శ్రీనివాసులు, తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి ఆ పార్టీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీ తరుపున జిల్లాకు చెందిన రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో నియమించినట్లు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఆ పార్టీ నాయకులు తెలిపారు.

పెద్దపీరయ్యస్వామి ఆరాధనోత్సవాలకు సర్వం సిద్ధం


ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువపందిర్లు

బ్రహ్మంగారిమఠం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పెద్దపీరయ్యస్వామి వారి ఆరాధన ఉత్సవాలు ఆదివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాటు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 30, 31తేదీలలో ముడుమాల గ్రామంలో వెలసియున్న సిద్దయ్యస్వామివారి మఠంలో అత్యంత వైభవంగా పెద్దపీరయ్యస్వాములవారి ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రస్తుత మఠాధిపతులు కలుగొట్ల సిద్దయ్య తెలిపారు. ఆరాధన మహోత్సవాలకు విచ్చేయుచున్న భక్తులకు వసతి, భోజనం, తాగునీరు వంటి వాటిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని మఠాధిపతులు తెలిపారు. అలాగే ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యాం కోసం చలువపందిర్లు, క్యూలైన్లను ఏర్పాటు చేశామన్నారు. ఆరాధన మహోత్సవాలకు వస్తున్న భక్తుల కోసం యాదవ అన్నదాన సత్రం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉద్యోగ ప్రకటన

శ్రీ చంద్రమౌళి విద్యానిలయం ఎయిడెడ్ హైస్కూల్, ప్రకాష్‌నగర్, కడప - 516004.

RC.No.123/B3/2024 Dated : 28.03.2025

రీజనల్ జాయింట్ డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్, కడప, వై.యస్.ఆర్. జిల్లా వారు మా పాఠశాలకు క్రింద పేర్కొనబడిన ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పోస్టుల భర్తీ చేయుటకు అనుమతి ఇచ్చి ఉన్నారు. కనుక అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నాము. దరఖాస్తు నకలుతో పాటు ఉపాధి నమోదు పత్రం జతపరచవలెను.

ఖాళీ పోస్టుల వివరాలు :

S. No.	పోస్టు వివరాలు	No. of Posts	రోస్టర్ పాయింట్ నెంబర్
1	SA MATHS	1	1 (OC)
2	TELUGU PANDIT GR-I	1	1 (OC)
3	HINDI PANDIT GR-II	1	1 (OC)
4	SGT	1	10 (BC-B)

ఎంపిక విధానం :

1) డిపార్ట్‌మెంట్ నామినీచే ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడును.
2) వయోపరిమితి ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎంపిక చేయబడును.
3) ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్హత కలిగి ఉండాలి.
4) TET పాస్ అయిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును.

దరఖాస్తు చేసుకొనవలసిన చివరి తేదీ : 19.04.2025

ఇట్లు : కరస్పాండెంటు



ఉపాధ్యాయుడి దాతృత్వం

● నిరుపేదరాలికి రూ.55 వేలతో ఇంటి నిర్మాణం

● దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేత



ఇంటి నిర్మాణంతోపాటు బాధితురాలు శ్రీదేవి కుటుంబానికి సహాయం అందిస్తున్న ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆచారి

కాశినాయన మార్చి29(ఆంధ్రజ్యోతి):జబ్బుతో మంచాన పడిన నర్సాపురం గ్రామానికి చెందిన నిరుపేద మహిళ మాయలూరి శ్రీదేవికి శనివారం తనవంతు సాయమందించి మానవత్వాన్ని చాటుకున్నాడు ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ఆచారి. రెక్కాడితేగాని డొక్కా డని అత్యంత నిరుపేద కుటుంబం మాయలూరి శ్రీదేవిది. దురదృష్టవశాత్తు భర్త సంజీ వరాయుడు రెండేళ్ల క్రితం గుండె పోటుతో మరణించాడు. భర్త చనిపోయిన కొన్నిరోజు లకే భార్య శ్రీదేవి పక్షవాతంతో మంచానపడింది. ఉన్న ఇద్దరు కుమారులు తల్లిని ఆసు పత్రుల్లో చూపించుకునే ఆర్థిక స్తోమతలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి దీన స్థితిని తెలుసుకొని మూలపల్లె ప్రభుత్వ పాఠశాల ప్రదానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న జీవి చంద్రశేఖర్ ఆచారి ఆ ఇంటిని పరిశీలించి దుస్థితిలో ఉన్న ఆ పరిస్థితిని చూచి చలించిపోయాడు. .దాదాపు రూ55 వేలు ఖర్చు పెట్టి ఇంటిలో గోడలు ప్లాస్టింగ్, లోపల ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ వర్క్, ఇంటి ముందుకు రేకులు దగ్గరుండి చేయించాడు. అంతే కాకుండా శనివారం మరి కొంత ఖర్చు పెట్టి ఆకుటుంబానికి బీరువా,సరుకులు, కొంత నగదు అందజేశారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ ఆచారి మాట్లాడుతూ ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆమె ఆరోగ్యంతో పాటు పదో తరగతి పరీక్షలు రాస్తున్న ఆమె చిన్నకుమారుడి చదువుకోసం సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

బద్వేలుటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగువారి తొలి పండుగ ఉగాదిఅని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ, కార్యకర్తలకు నాయకులకు ఉగాది శుభాకాంక్షలని, ఈ సంవత్సరం ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆనందోత్సాహాలతో సంతోషంగా ఉండాలని ఆ దేవుడిని కోరుకుంటూ శ్రీవిశ్వావాసు నామసంవత్సర ఉగాది పండుగ శుభాంక్షలు అని వారు తెలిపారు.

వన్యప్రాణులను కాపాడుకోవాలి

పోరుమామిళ్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం, వన్య ప్రాణులను ప్రజలు కాపాడుకోవాలని ఫారెస్టు రేంజర్ రఘు నాథరెడ్డి అన్నారు. జిల్లా అటవీశాఖాధికారి వినీత్‌కుమార్ ప్రొద్దుటూరు సబ్ డివిజను అధికారి దివాకర్ ఆదేశాల మేరకు పోరుమామిళ్ల రేంజ్ ఆఫీసరు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మల్లేపల్లె సెక్షన్ సిద్దవరం బీట్ పరిధిలోని చల్లగిరిగెల కోదండ రామస్వామి ఆలయ ఆవరణలో వీరభద్ర కళాజాత వారిచే గ్రామస్థులకు ఎర్రచందనం ఆవశ్యకత, వన్యప్రాణుల సంరక్షణ గురించి కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఫారెస్టుసిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

మైదుకూరు రూరల్ ,మార్చి29(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వీణావిజయ్‌నగర్ కాలనీ, వెంకట సుబ్బయ్యకాలనీ, చెంచు కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి శివరాంలు కోరారు. ఆమేరకు శనివారం మున్సిపల్ చైర్మెన్ మాచనూరు చంద్ర, కమిషనర్ శ్రీనివాసులరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అంతేకాకుండా కొన్ని వీధులలో రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను తీర్చక పోతే ధర్నాలు చేస్తామన్నారు.

విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు

● దేహశుద్ధి చేసిన విద్యార్థిని తల్లిదండ్రులు, స్థానికులు



ఉపాధ్యాయుడిని తీసుకెళుతున్న పోలీసులు

బద్వేలుటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చదువుచెప్పాల్సిన గురువే విద్యార్థినిపట్ల వక్రదృష్టితో అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో విద్యార్థిని తల్లిదం డ్రులు, స్థానికులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడిని చితకబాదిన ఘటన బద్వేలు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మున్సిపాలిటీ పరిధిలోని ఓ పాఠశాలలో చదువుతున్న 4వ తరగతి విద్యార్థిని పట్ల అక్కడ ప్రైవేటు టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న అన్వర్ మధ్యాహ్నం భోజనసమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎవరూలేని సమయంలో విద్యార్థినిని తరగతి గదిలోకి పిలిచి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ విద్యార్థినీ భయపడి ఉపాధ్యాయుడి నుంచి తప్పించుకొని ఇంటికి ఏడుస్తూ వెళ్లింది. దీంతో తల్లిదండ్రులు ఏమి జరిగిందని అడుగగా ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించిన తీరును చెప్పడంతో ఒక్కసారిగా తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలలోకి వెళ్లి ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. విద్యాబుద్దులు నేర్పించి తమ పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుడే ఇలాంటి ఘాతుకానికి పాల్పడితే ఏమి చేయాలంటూ తల్లిదండ్రులు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడ గుంపుగా ఉన్న వారిని చెదరగొట్టి విద్యార్థినిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు అన్వర్‌ను అదుపులోకి విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కుబడిగా సాగిన మండల సమావేశం

దువ్వూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మొక్కుబడిగా జరిగింది. సమావేశంలో వివిధ శాఖలలో చేపడుతున్న కార్యక్రమాల గురించి సంబందిత అధికారులు చదివి వినిపించడం తప్ప ఒరిగిందేమీలేదు. సమావేశానికి ఎంపీపీ జయచంద్రారెడ్డి అధ్యక్షత వహించగా ఎంపీడీవో రామకృష్ణయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగహన

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 29(ఆంధ్రజ్యోతి): గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. హారిక శనివారం అవగహన కల్పించారు. ఈ సందర్భంగా వివేకనంద కాలనీ లోని సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్ 2 ను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు పోక్సో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగహన కల్పించారు.

సామాజిక తనిఖీలో రూ.55వేలు రికవరీకి ఆదేశం

ముద్దనూరు మార్చి29(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ సామాజిక తనిఖీలో రూ.55వేలు రికవరీకి ఆదేశించిన ట్లు అధికారులు తెలిపారు. ఇందులో శనివారం నిర్వహించిన ప్రజావేదిక లో రూ.26,150 రికవరీ అయ్యిందని ఏపీవో గంగయ్య తెలిపారు. స్థానిక ఉపాధి హామి కార్యాలయం వద్ద 2023-24 ఆర్థిక సంవత్సరం సామాజిక తనిఖీ ప్రజావేదిక జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనుల నిర్వహణపై ప్రజావేదికలో చదివి వినిపించారు. మస్టర్, కొలతలో తేడా ఉందని సోషల్ ఆడిట్ సిబ్బంది రూ.55వేలు రికవరీకి ఆదేశించినట్లు ఏపీవో గంగయ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రామలింగేశ్వరరెడ్డి, ఎంపీడీవో ముకుందారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారిమధుసూదన్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ఖాజీపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలని మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పత్తూరు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరుపట్టి, మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఏఎన్ఎం, ఆశాలు సచివాలయాల్లో సరిగా విధులకు హాజరుకాకుండా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని, మరోమారు ఇలా జరిగితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు రవి, పుల్లయ్యనాయుడు, రామానాయుడు, దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు, కదిరుల్లా పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 15 మంది ఉద్యోగాలకు ఎంపిక

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 15 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్ తెలిపారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలోని ఆల్‌డిక్షన్ టెక్నాలజీస్‌లో అసెంబ్లింగ్ ఆపరేటర్, హెల్పర్, టెక్నీషియన్ ఉద్యోగాల కోసం జవహర్‌నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. ఈ జాబ్‌మేళా కు 50 మంది అభ్యర్థులు హాజరుకాగా 15 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ప్రిన్సిపల్, జేకేసీ కోఆర్డినేటర్ శశికాంత్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

మైదుకూరు రూరల్ ,మార్చి29(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం లభించింది. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాటు కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

పీ4 సర్వే వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

జమ్మలమడుగు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ పీ4 సర్వే కార్యక్రమానికి రెండు బస్సులను ప్రారంభించారు. ముందుగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ఈ సర్వే కార్యక్రమం లక్ష్యమన్నారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ విజయవంతం కావాలన్నారు.కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, శ్రీను, నవనీశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, బొమ్మేపల్లె సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రైల్వేస్టేషన్ ఆవరణంలో ప్రయాణికుల భద్రత కోసం సీసీ కెమెరాలు అమర్చాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం జమ్మలమడుగు ఎన్జీవో హోం నందు ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల చోరీలు సైతం జరుగుతున్నాయని అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అధిగమిస్తే చర్యలు తప్పవు

ప్రొద్దుటూరు మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ట్రాఫిక్ రూల్స్ ను అధిగమించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్ తెలిపారు. శనివారం ద్విచక్ర వాహనాలు నడిపే యువకులను ట్రాఫిక్ పోలీసు స్టేషనుకు పిలించి అవగాహన కల్పించారు. వాహనాలకు అన్నిపత్రాలే ఉండాలన్నారు. తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పట్టణంలో కాగా చౌటపల్లె సర్కిల్లోని వైఎస్ ఆర్ సర్కిల్లో వాహనాలను రూరల్ ఎస్ఐ సురేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్సు ఆర్‌సీ లేని వాహనాలు సీజ్‌చేశారు. ప్రతి వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కల్పించారు.



















